1

# ఇశ్రాయేలులో దేవుని మనిషి

## (1 రాజులు 16:29-17:1)

రండి మనం ఒక ప్రత్యేకమైన మనిషిని గూర్చి చదువుదాం. ఇతడు ఇశ్రాయేలులో మునుపెన్నడు ఎరుగని ఒక గొప్ప యుగ పురుషునిగా గుర్తించగలం. ఇతడు ఒక్కసారి అమాంతంగా తళుక్కుమంటూ చీకటిలోనుండి ప్రచండ వెలుగులోనికి దూకినట్లు రంగస్థలంలో ప్రవేశిస్తున్నట్లున్నాడు. ఇతడు తన సమకాలీన చీకటి సమయాల్లో ఒక ఉల్కలాగా దూసుకెళుతూ పెద్ద సుడిగాల్లోనే వెళ్ళిపోతున్నాడు. ఆయనకు "అగ్ని మనిషి" అని పేరు, అతన్ని మనం "ఇశ్రాయేలులో దేవుని మనిషి" – ఏలీయా అని పిలుస్తున్నాం.

బైబిల్లో కొన్ని అధ్యాయాలు మాత్రమే తెల్పుతుండగా ఏలీయాను గురించి మనం తెల్సుకోగల్గుచున్నాము, కాని అదేదో కొంత మన ఊహను ఇట్టే ఆకట్టుకుంటుంది. క్రొత్త నిబంధన సమయం వచ్చేసరికి అతను ఇశ్రాయేలు ప్రజల్లో గొప్ప గౌరవ ప్రతిష్ఠతలు కల్గి గౌరవించబడినవాడిలా ఉన్నాడు, అబ్రాహాము, మోషేల చాటుచేసుకొని వచ్చిన వ్యక్తిలావున్నాడు. పాత నిబంధనలో ఏ ప్రవక్తను గుర్తించి ప్రస్తావించని రీతిగా, క్రొత్త నిబంధనలో ముప్పై సార్లుకంటె ఎక్కువ సార్లు అతని గురించి ప్రస్తావించబడింది.

యేసు రూపాంతర సమయంలో యేసు మోషే దావీదులతో లేదా మోషే యెషయాలతో కనబడలేదు గాని మోషే ఏలీయాలతో ప్రత్యక్షమయ్యాడు. మోషేయేమో ధర్మశాస్త్రాన్ని తీసుకొని వచ్చిన గొప్ప వ్యక్తి; గాని ఏలీయా మాత్రం ఒక రాజ్యాన్నే ధర్మశాస్త్రంవైపుకు మళ్ళించిన వ్యక్తి. దేవుని ఆజ్ఞలను జారీ చేయడం ఎంతో ప్రాముఖ్యమైన విషయం; కాని మనుష్యున్ని దేవుని చట్టాల, నిబంధనల, బయల్పాటు వైపు మరల్చడం దానికంటె ప్రాముఖ్యమైనది.

ఏలీయా అసలు సిసలైన నికార్సు వ్యక్తి. ఒకవేళ ఎవరైనా *మోనాలిసా* (*Mona Lisa*) చిత్రాన్ని అచ్చు వేయడం లేదా కొన్ని డాలర్లు విలువ చెల్లించి కొనగలరేమోగాని, అసలైన విలువైన దానికి యింత ధర అని మాత్రం సూచించలేం. తనతరంలో దేవుని కోసం గొప్ప విషయాలు సాధించిన ఏలీయా పనికి విలువను ఎంతైనా ఆపాదించలేం.

ఈ ఏలీయా గురించి అతడు చేసిన సేవ గురించి మనం ధ్యానిస్తుంటే, అతన్నేదో ఒక మానవాతీతునిగా గాని, మనకు అలివిగానిది అతడు చేసి సాధించగల అతీతమైన శక్తి సామర్థ్యంగలవాడుగా గాని అతనికేదో గొప్ప వనరులున్న వ్యక్తిగగాని ఎంపిక చేయుట మనకలివి కాదు. అతని జనులే ఆ పొరపాటు చేశారు. రెండు నిబంధన కాలాల మధ్య యూదులు ఏలీయాను గురించి అనేక ఆచారపరమైన విధానాలను పెంపొందించారు. అతడేదో శక్తి సామర్థ్యాలు ప్రతిభగల మానవాతీతునిగా అంతెత్తుకు ఎత్తారు. ఈ విధంగా యాకోబు తన పత్రికల్లో ఏలీయాను గూర్చి ఎంతో మెళుకువతో వ్యవహరిస్తూ "ఏలీయా

మనవంటి స్వభావము గల మనుష్యుడే" (యాకోబు 5:17) అని అన్నాడు. బైబిల్లో KJV తర్జుమా యింకా అర్థవంతంగా చెబుతూ ఏలీయాకూడా "మనం ఎలాంటి అనుభవాలు కలిగియున్నామో అతను ఆ అనుభవాలే కలిగియున్నాడు" అని ఉంది. మనం ఎలా ఆలోచిస్తామో అతను అలా ఆలోచించాడు. మనం ఎలా బాధ, వేదనలతో బాధపడ్డామో అతను అంతె. మనం ఎలా నిరుత్సాహపడినామో అతను కూడ నిరుత్సాహ పడినాడు.

వాస్తవమేమంటే, ఏవిధంగా చూచినా, ఏలీయా దేవుని యొక్క ప్రత్యేకమైన మనిషి. ఆ సమయానికి ఆ కాలానికి దేవుడు ఏర్పాటు చేసుకున్న వ్యక్తి. అతని జీవితం గురించి చదువుతూపోతుంటే, ఎందుకో మనకే తెలుస్తుంది.

## ఏలీయా దినాల్లో ఇశ్రాయేలీయులు

ఏలీయాను పూర్తిగా అభినందించాలని మనం అనుకుంటే, అతని సమకాలీన జీవితంలోకి మనం వెళ్ళాలి. ఒకసారి నేనొక చిత్రపటాన్ని చూచాను అదెంత నన్ను ఆకర్షించి ఆకట్టుకున్నదో చెప్పలేను. తర్వాత దాని క్రింద వ్రాసినదానిని చదివాను. ఈ చిత్ర పటాన్ని కాళ్ళూ చేతులూ లేని ఒక వికలాంగుడు చిత్రించాడు. ఆ చిత్రకారుడు తన నోటితో ఆ కుంచె పట్టుకొని చిత్రీకరించాడు. ఇక నేను ఆ చిత్రపటాన్ని *ఎంతగా* అభినందించానంటే చెప్పలేను. అదే విధంగా 1 రాజులు 17వ అధ్యాయము తరువాతి అధ్యాయాలు చదువుతూ, అతడు జీవించిన సమయం ఆనాటి స్థితిగతులు, అతని సేవాపరిచర్యను గ్రహిస్తూ ముందుకు సాగితే అతనిని మరింకెంతగానో అభినందించగలం:

> యూదారాజైన ఆసా యేలుబడిలో ముప్పదియెనిమిదవ సంవత్సరమున ఒమ్రీ కుమారుడైన అహాబు ఇశ్రాయేలువారికి రాజై షోమ్రోనులో ఇశ్రాయేలువారిని ఇరువది రెండు సంవత్సరములు ఏలెను (1 రాజులు 16:29).

ఇక్కడ "యూదా" మరియు "ఇశ్రాయేలు" అనే పదాలను ముఖ్యంగా గమనిద్దాం. ఇవి సౌలు, దావీదు, సొలొమోను ఏలిన సమైక్య రాజ్యం. కాని సొలొమోను కుమారుడైన రెహబాము, తప్పుడు సలహాలు విన్నందున ఈ రాజ్యం రెండుగా విభజింపబడింది (1 రాజులు 12). తర్వాత అంతఃకలహం చెలరేగింది. తర్వాత ఈ దుమారం సద్దుమణిగాక ఐక్యంగా నిలబడవలసిన రాజ్యాలు రెండుగా నిలిచాయి. తర్వాత ఈ దక్షిణ రాజ్యాలు పన్నెండు వంశాల నుండి వేరై రెండుగా మాత్రమే నిలిచాయి. ఈ రెండింట్లో ప్రాబల్యముగల జాతి యూదా వంశము, కాబట్టి దక్షిణ రాజ్యం బబులోనీయుల హస్తాల్లో పడేవరకు దావీదు సంతతి వారైన పదిహేడుమంది రాజులతో వరుసగా ఏలబడింది.

ఇక్కడ ఉత్తర రాజ్యాలకు సంబంధించిన విషయాలు మనకెంతో ఆసక్తికరంగా ఉంటాయి, ఎందుచేతనంటే ఏలీయా ఉత్తర ప్రాంతంలో పని చేశాడు. ఈ ఉత్తర తీర ప్రాంతమంతటిని ఇశ్రాయేలీయుల రాజ్యమని పిలువబడుతుంది, ఎందువలనంటే ఇశ్రాయేలీయుల పన్నెండు గోత్రాలలోని పది గోత్రాలు యీ ప్రాంతంలో ఉన్నాయి కాబట్టి, దీని మొదటి పరిపాలకుడు యరొబాము, అతనొక విగ్రహారాధికుడు. అతని తరువాత 19 మంది దుష్ట రాజులు ఆ దేశాన్ని వరుసగా ఏలారు. అది అష్సీరియా హస్తాల్లో చిత్తుచితైపోయేవరకు చెడు రాజులు ఏలారు.

ఇశ్రాయేలీయులను అహాబు ఇరువదిరెండు సంవత్సరాలు పరిపాలించాడు. ఇతని పరిపాలనలో ఇశ్రాయేలు బహు ప్రసిద్ధిలో ఉందని రాజ్య చరిత్ర తెలియజేస్తుంది (1 రాజులు 21:1; 22:39 గమనించు). అతనొక గొప్ప సేనాధిపతి నాయకుడు. సిరియా మీద రెండు సార్లు యుద్ధం చేసి గెలిచాడు. అంతేకాదు అస్సీరియా మీద కూడ దండెత్తి ఒకేసారి గెలిచాడు. అతని విదేశ రాజనీతి ఘనమైనది. రాజకీయంగా భౌగోళికంగా మరియు సైనికపరంగా అతనెంతో సాధించాడు. అతని పరిపాలనా కాలంలో ప్రజలు శాంతి సౌభాగ్యాలతో విలసిల్లారు.

ఏది ఏమైనా, ఉత్తేజితుడైన గ్రంథకర్త మాత్రం ఈ పరాక్రమ కృత్యాలను గురించి బహు తక్కువగా వ్రాశాడు. అవి అంత ముఖ్యమైన విషయాలేమి కావు. 1 రాజులు 16:30లో అతని పరిపాలనలోని దైవిక దృక్పథం ప్రస్తావించబడింది: "ఒమ్రీ కుమారుడైన అహాబు ప్రభువు దృష్టిలో అతని పితరుల కంటె ఎక్కువగా చెడుతనం జరిగించాడు."

"అతని కంటె ముందున్నవారందరి కంటె": ఇదెంత చెడ్డ విషయం. ఒకవేళ కొందరు పరిశుద్ధుల తర్వాత వచ్చిన వ్యక్తి అంటే, అది అంత చెడుగా ఉండకపోయి ఉండేది కాదేమో. ఈ పద సముదాయాన్ని బాగా అర్థం చేసుకోవాలంటే అహాబుకంటే ముందున్నవారిని గూర్చి అవలోకనం చేస్తే మంచిది.

ఇశ్రాయేలు యొక్క మొదటి రాజైన *యరొబాము* విగ్రహారాధికుడు.

> [యరొబాము] తన హృదయమందు తలంచి ఆలోచనచేసి రెండు బంగారపు దూడలు చేయించి, జనులను పిలిచి – యెరూషలేమునకు పోవుటకు మాకు బహు కష్టము; ఇశ్రాయేలువారలారా, ఐగుప్తులోనుండి మిమ్మును రప్పించిన మీ దేవుడు ఇవే అని చెప్పి, ఒకటి బేతేలునందును, ఒకటి దానునందును ఉంచెను. మరియు అతడు ఉన్నత స్థలములను కట్టించి మందిరముగా ఏర్పరచి, లేవీయులు కాని సాధారణమైన వారిలో కొందరిని యాజకులుగా నియమించెను. ఈ ప్రకారము అతడు యోచించిన దానినిబట్టి యెనిమిదవ మాసము పదునైదవ దినమందు బేతేలులో తాను చేయించిన బలిపీఠము మీద బలులు అర్పించుచు వచ్చెను (1 రాజులు 12:28, 29, 31, 33).

యరొబాము చెడుకు దారి చూపినవాడు. విగ్రహారాధనకు విత్తనాలు విత్తినవాడు, అదికూడ బాగా లోతుగా విత్తినవాడు. అతని తరువాత వచ్చిన రాజులు అతన్ని అనుసరించారు, వారంతా యరొబాము నడచిన చెడు మార్గంలో నడవడం మనం చూడ బోతున్నాము.

యరొబాము ఇరువది రెండు సంవత్సరాలు ఏలినాడు; తరువాత అతని కుమారుడైన నాదాబు అతని తర్వాత పరిపాలించాడు (1 రాజులు 14:20).

ఒకవేళ *నాదాబు* "అయిందేదో అయింది యింతటితో చాలు యికనుండి యెహోవానే మనం ఆరాధిద్దాం" అంటే బాగుండేదేమో కాని అతడు అలా అన్నాడా? అనలేదు సుమా:

> యరొబాము కుమారుడైన నాదాబు యూదారాజైన ఆసా యేలుబడిలో రెండవ సంవత్సరమందు ఇశ్రాయేలువారిని ఏలనారంభించి ఇశ్రాయేలువారిని రెండు సంవత్సరములు ఏలెను. అతడు యెహోవా దృష్టికి కీడుచేసి తన తండ్రి నడిచిన మార్గమందు నడిచి, అతడు

> దేనిచేత ఇశ్రాయేలువారు పాపము చేయుటకై కారకుడాయెనో ఆ పాపమును అనుసరించి ప్రవర్తించెను (1 రాజులు 15:25, 26).

రెండు సంవత్సరముల తరువాత, నాదాబు బయెషా అనేవాని చేత చంపబడినాడు (1 రాజులు 15:27, 28).

*బయెషా* క్రొత్త రాజ వంశాన్ని ప్రారంభించాడు. అతనిదొక శుభారంభంగా పరిణమించి ఇశ్రాయేలును ఒక మంచి రాజు ఏలుటకు వీలయింది. మరలా అలా జరగలేదు: బయెషా మూక్కుమ్మడి హత్యలు చేసాడు. "అతడు రాజుగా అయ్యాడో లేదో యరొబాము కుటుంబ సభ్యులందరిని నరికి వేశాడు యరొబాము కుటుంబంలో ఏ ఒక్కరిని కూడ యరొబాముకు విడిచి పెట్టకుండ అందరిని హతంచేశాడు" (1 రాజులు 15:29). ఏమైతేనేమి అతను చంపిన ఆ కుటుంబంలో ఏ ఒక్కరికంటె పాలనలో అతడేమీ మించిన వాడేమి కాదు.

> ... ఆసా యేలుబడిలో మూడవ సంవత్సరమందు అహీయా కుమారుడైన బయెషా తిర్సాయందు ఇశ్రాయేలువారినందరిని ఏలనారంభించి యిరువది నాలుగు సంవత్సరములు ఏలెను. ఇతడు యెహోవా దృష్టికి కీడు చేసి యరొబాము దేనిచేత ఇశ్రాయేలువారు పాపము చేయుటకు కారకుడాయెనో దానినంతటిని అనుసరించి ప్రవర్తించెను (1 రాజులు 15:33, 34).

చివరకు బయెషా మరణించెను, అతనికి మారుగా అతని కుమారుడు ఏలా ఏలనారంభించెను (1 రాజులు 16:6).

*ఏలా* రెండు సంవత్సరములు ఏలెను (1 రాజులు 16:8). ఇశ్రాయేలు నేలిన అనేకమంది నాస్తిక రాజుల వరసలో ఇతడు మరొకడు:

> తిర్సాలో తనకు గృహనిర్వాహకుడగు అర్సాయింట అతడు త్రాగి మత్తుడై యుండగా, యుద్ధ రథముల అర్ధభాగముమీద అధికారియైన జిమ్రీ అతని మీద కుట్రచేసి లోపలికి చొచ్చి అతని కొట్టి చంపి అతనికి మారుగా రాజాయెను (1 రాజులు 16:9, 10).

*జిమ్రీ* తన పరిపాలన ప్రారంభంలోనే బయెషా యింటి వారందరిని చంపినాడు (1 రాజులు 16:11). అతని పరిపాలన ఎంత కాలం సాగింది? "జిమ్రీ తిర్సాలో ఏడు దినములు ఏలెను" (1 రాజులు 16:15). జిమ్రీ మీద ప్రజలు ఎంతో కోపంతో ఉన్నారు, సైన్యాధిపతియైన జిమ్రీని అతనికి మారుగా రాజును చేశారు. తర్వాత ఒమ్రీ జిమ్రీ ఉన్న స్థలానికి వచ్చాడు. ఇక ఒమ్రీ ఎలాగైనా తాను తప్పించుకోనని ఎరిగి తాను రాజ నగరులోనికి వెళ్ళి తనతో కూడ రాజనగరును తగులబెట్టుకొని చనిపోయెను. (అంటే "నేను అనుభవించలేనిది ఎవరు అనుభవించకూడదని" భావించాడు.)

*ఒమ్రీ.* ఇక్కడ అహాబుకు తండ్రియైన ఒమ్రీ పరిపాలనను గురించి మనకు తెలియజేస్తుంది. ఈ విధంగా ఒమ్రీ ఉత్తర రాజ్యాలంతటిని ఏలెను. అతడు పండ్రెండు సంవత్సరములు పరిపాలన చేసి సమరయ పట్టణాన్ని కట్టినాడు (1 రాజులు 16:23, 24). మానవతా దృక్పథాన్ని బట్టి చూస్తే అతని పరిపాలన విజయవంతంగానే ఉంటుంది. కాని దేవుడు యితని పరిపాలనను ఎలా గుర్తిస్తున్నాడు?

> ఒమ్రీ యెహోవా దృష్టికి చెడుతనము జరిగించి, తన పూర్వికులందరికంటె మరి దుర్మార్గముగా ప్రవర్తించెను. అతడు నెబాతు కుమారుడైన యరొబాము దేనిచేత ఇశ్రాయేలువారు పాపము చేయుటకు కారకుడై దేవతలను పెట్టుకొని, ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవాకు కోపము పుట్టించెనో, దానిని అనుసరించి ప్రవర్తించెను (1 రాజులు 16:25, 26).

అతడు మరణించినప్పుడు, అతనికి మారుగా అహాబు రాజాయెను (1 రాజులు 16:28).

మనమిక్కడ ఆరు దశాబ్దాలగుండా ఈదుకుంటూ దాటుకుంటూ వచ్చాము. ఈ అరవై సంవత్సరాల కాలంలో గొప్ప రక్తపాతం, క్షీణత, హత్య, విగ్రహారాధన, అసూయ, ద్వేషాలు, కుట్ర, దురాలోచన, అవినీతి మనం చూచాం. ఇప్పుడు మనం యీ మాటలు ఎందుకు చెప్పబడినాయో గ్రహిస్తాం. "ఒమ్రీ కుమారుడైన అహాబు తన పూర్వికులందరిని మించునంతగా యెహోవా దృష్టికి చెడుతనము చేసెను" (1 రాజులు 16:30). ఇశ్రాయేలు చరిత్రలో అణగారిన ఆటుపోట్లు కారు చీకట్ల అనుభవంలోకి చేరుకున్నాము. ఒక సింహాసనం ఇంతస్థాయికి దిగజారిపోతే దేవుని ప్రజలనబడినవారి నాయకత్వం యీ విధంగా ఉంటే ఇక ప్రజానీకం పరిస్థితి ఏ స్థాయిలో ఉంటుందో మనం ఊహించవచ్చు!

మన పఠనంలోకి తిరిగి వద్దాం, 31 వచనం చూద్దాం: "నెబాతు కుమారుడైన యరొబాము జరిగించిన పాపక్రియలను అనుసరించి నడుచుకొనుట స్వల్ప సంగతి అనుకొని, ... ." యింకా మనం నేడు యిలా అనవచ్చు, "అది స్వల్ప సంగతి యని అనుకుంటున్నాడంటే," "విగ్రహారాధన చేసినప్పటికి ఏం పర్వాలేదు" అని అనుకున్నాడని.

ఇశ్రాయేలులో పరిస్థితులు మరీ క్షీణదశకు దిగజారాయి అని అనుకోవడం తప్పుకాదు. 31వ వచనం చివరి భాగంలో మన దృష్టిని ఆకట్టుకునే పదం చూస్తున్నాం: "అతడు సీదోనీయులకు రాజైన ఎత్బయలు కుమార్తెయైన యెజెబెలును వివాహము చేసుకొని బయలు దేవతను పూజించుచు వానికి మ్రొక్కుచునుండెను."

ఇంతవరకు మనం అధ్యాయాల్లో ఇశ్రాయేలు రాజు వివాహం చేసుకున్న సందర్భాలను గూర్చి చూడలేదు, కాని యిక్కడ చూస్తున్నాం. ఎందుచేతనంటే అహాబు వివాహము చేసుకున్న వారెవరో వారి కారణంగా.

యెజెబెలు అన్న పేరు ప్రస్తావించబడినప్పుడు మనం ఏమని ఆలోచిస్తున్నాము? బహుశ చాలా అందగత్తె అని – ఆమె అందం ద్వారా ఎవరినైనా యిట్టే బుట్టలో వేసుకోగల వ్యక్తి అని బహుశా మనం అనుకోవచ్చు మరియు యుక్తిగల జిత్తులమారి అని, మనస్సాక్షి నీతినియమాలులేని వ్యక్తి అనీ అనుకోవచ్చు. యెజెబెలు బైబిల్లో నీచముగా ఎంచబడిన స్త్రీ; ఆమె పేరు దుష్టత్వానికి మారుపేరు. ప్రకటన గ్రంథంలోని తుయతైర సంఘం అన్నింటికీ రాజీపడే సంఘంగా ఉంది. ఆ సంఘంలో యెజెబెలు ఒక సభ్యురాలుగా ఉంది (2:20). బహుశా ఎవరైనా వారి కుమార్తెకు యెజెబెలు అని పేరు పెట్టినవాళ్ళను నేను ఎప్పుడే ఎరుగను.

ఇక్కడ వాక్య భాగం ఏమని చెబుతుందంటే, ఆమె "సీదోను రాజైన ఎత్బయలు కుమార్తె" అని. ఆమె ఒక అన్యురాలు, అన్యులనుండి పెండ్లిచేసుకోకూడదు అంటూ ఇశ్రాయేలీయులకు చెప్పాడు (ద్వితీయోపదేశకాండము 7:1–5). ఆమె ఏదో సాధారణమైన

వ్యక్తి కాదు. ఎత్బయలు బయలుకు యాజకుడు అని చరిత్ర చెబుతుంది. బయలు ఫొయనీయులకు ప్రాముఖ్యమైన గృహ దేవత. ప్రత్యేకంగా, యితడు మెల్‌కార్ట్ అష్టారేతు అనబడిన బయలు శక్తిని ప్రదర్శించడానికి నియమించబడినాడు. ఈ దేవతాశక్తికి సమర్పించుకొన్న వ్యక్తి రాను రాను శక్తి సామర్థ్యాలను తనపై ఆపాదించుకొని ఫెలిస్ అనే వాణ్ణి చంపి తూరు, సీదోనుల మీద రాజుగా సింహాసనాన్ని అధిష్ఠించాడు. అతని రాజ దుస్తులు రక్త పాతంవల్ల మలినమయ్యాయి. యెజెబెలు తన తండ్రి దగ్గర బాగా పాఠాలు నేర్చుకొంది: ఆ దేవతలపట్ల అమితమైన భక్తిశ్రద్ధలు, తనకంటె తక్కువ వాళ్ళ బలహీనుల పట్ల తక్కువ చూపు చూడ్డం వారిని కించపరచడానికి అలవాటు పడింది. దయ, కరుణ, కనికరాలు ఆమె స్వభావంలోనే లేవు.

రెండవదిగా, ఆమె చేసిన దానినిబట్టి అహాబు యెజెబెలును చేసుకోవలసి వచ్చింది. యెహోవాకు ప్రత్యేకమైన ప్రజలైన ఇశ్రాయేలీయుల సమాజంలో, వారి హృదయాల్లో వారి జీవితాల్లో బయలు దేవతారాధనను ప్రవేశ పెట్టాడు, పరిచయం చేశాడు.

శబ్దార్థ ప్రకారం "బయలు" అంటే "ప్రభువు" అని అర్థం. వారి దేవతల లేక దేవుళ్ళ నామాన్ని గుర్తించడానికి ఈ పదాన్ని వాడతారు. అంతేగాక వారియొక్క ముఖ్యమైన పురుష దేవుణ్ణి గురించి ప్రస్తావించడానికి ఈ పదాన్ని వాడతారు. బయలు సర్వసౌభాగ్యాలకు దేవుడైయున్నాడు: సూర్య దేవుడు; పుడమి దేవుడు, వృక్షజాతులకు దేవుడు, పాడి పంటలకు దేవుడు; గాలి దేవుడు, వాన దేవుడు, ఋతువుల దేవుడు. ఒక్కొక్క సమయంలో చక్కగా పంటలు పండాయంటే వారు యెహోవాను మర్చిపోయి; బయలుకు కృతజ్ఞతలు చెల్లించేవారు, లేదా అతని క్రింద వారికి కృతజ్ఞతలు చెల్లించేవారు.

కనానీయులకు ఈ బయలును ఆరాధించడం అనాదిగా వచ్చిన సంస్కృతి, కాని ఇశ్రాయేలీయులకు యిదొక ముఖ్య విషయం కాదు. యరొబాము కూడ బంగారు దూడలు, ఎత్తైన స్థలాల్లో పూజలు పునస్కారాలతో యెహోవా ఆరాధనలను పూర్తిగా మలినం చేశాడు. ఇక యెజెబెలు అమ్మగారు ఆహా గొప్ప మిషనెరీ భారంతో రంగంలోకి దిగింది. సొలొమోను పరదేశీయ భార్యలు సైతం వారి వారి దేవుళ్ళను దేవతలను యెరూషలేములో ఉన్న యెహోవాతో సహచరులుగా నిల్పబడడానికి ఒప్పుకున్నారు గాని, యెజెబెలు మాత్రం ససేమిరా ఒప్పుకోలేదు. తన దేవుడే నిజమైన దేవుడు, ఏకైక దేవుడు; అంతేకాదు యెహోవాను ఆరాధించడం అనేది పూర్తిగా తుడిచిపెట్టాలి, ఎత్తైయ్యాలి.

యెహోవా బలిపీఠాలు ధ్వంసం చేయబడ్డాయి. యెహోవా ప్రవక్తలు అడవి జంతువుల్లా వేలాడబడ్డారు లేదా చంపివేయబడ్డారు లేదా నోళ్ళుమూయించబడ్డారు. 450 మంది బయలు యాజకులను బయలుకు సహచారిణియు సంతాన దేవతయైన అషేరా యొక్క 400 మంది యాజకులైన నాస్తిక ప్రతినిధులతో ఆ దేశాన్నంతా పూర్తిగా నింపివేసి బయలు యొక్క "సువార్తను" పూర్తిగా ప్రబలం చేయడానికి కారకురాలైయుంది. ఆ ప్రాంతమంతా ఆలయాలు పీఠాలు యెజెబెలు కట్టించింది, ఇక తను తన చెలికత్తెలతో కలిసి ఆ ఆలయాల్లో దేవస్థానాల్లో జరిగే అపవిత్రమైన పూజలు పురస్కారాల్లో పాల్గొన్నది.

ఈ స్త్రీకి ఉన్న ఆసక్తి గురించి నేను చదువుతుంటే, *సత్యం*పట్ల ఆమెకున్న శ్రద్ధాసక్తులు మనకు ఉన్నట్లయితే మనమేం చేసి సాధించేవారమోనని నాకనిపిస్తుంది. మనం మాత్రం ఆమె పద్ధతులు అనుసరించకూడదు సుమా! దేవుని వాక్యం విస్తరించి అభివృద్ధి చెందాలంటే

కేవలం దేవుని విధానమే సరైన ఒకే ఒక మార్గమని యిక దాన్ని నిర్వహించుటలో మనం శాయశక్తులా శక్తికొలది మనసుంచి పనిచేస్తేనే అది సఫలీకృతం కాగలదని మనం నిశ్చయించాలి!

ఏదైతేనేమి, యెజెబెలు యొక్క విధానంతో మనం సరిపెట్టుకోలేదు. తిరిగి మనం ఆ పాఠ్యాంశంలోనికి వద్దాం, యెజెబెలు అహాబునెలా ప్రేరేపించిందో చూద్దాం:

> [అతను] బయలు దేవతను పూజించుచు వానికి మ్రొక్కుచుండెను. షోమ్రోనులో తాను బయలునకు కట్టించిన మందిరమందు బయలునకు ఒక బలిపీఠము కట్టించెను. మరియు అహాబు దేవతాస్తంభమొకటి నిలిపెను (1 రాజులు 16:31బి–33ఎ).

ఈ తతంగమంతా చూస్తుంటే అహాబు అనే పురుషుడు బలహీనుడనియు అతని భార్య బలవంతురాలనియు మన మనస్సుల్లో ఒక చిత్రమేర్పడుతుంది. దాంపత్యంలో ఆమెదే పై చేయి అని. నిర్ణయాలన్ని ఆమె చేసేది. మనం ముందుకు వెళ్ళబోవుచున్న అధ్యాయంతో అహాబుకు ఏలీయాకు మధ్యగల విభేదం వారిద్దరికంటే, ఏలీయా యెజెబెలుల మధ్య పోరాటమని చెబితే సబబుగా ఉంటుంది: యెజెబెలు చెడు మూర్తీభవించినట్లును, ఏలీయా మంచిని మూర్తీభవించినట్లును వీరిద్దరి మధ్య అహాబు ఇరుకున పడ్డట్లున్నది.

పాపం అహాబు పరిస్థితిచూస్తే మనకెంతో విచారం కలుగుతుంది. అతడు ఏలీయా, యెజెబెలుల మధ్య చిక్కుకున్నాడు. ఒక పక్క అడ్డగించలేని ఆధిక్యం, మరో ప్రక్క మొండి పట్టుదల. అతనే గనుక మరొక వ్యక్తిని వివాహం చేసుకొనివుంటే పరిస్థితులు ఎలా ఉండేవో. ఇతని పేరు మూలార్థంలో వెళ్ళి చూస్తే "తండ్రే నా సోదరుడు" అని అర్థమిస్తుంది, అంటే అసలైన అర్థమేమంటే "పరలోకపు తండ్రి నా సోదరుడు" అతని పిల్లలకు సైతం అతను యెహోవాను ఘనపరచు పేర్లుపెట్టుకున్నాడు. అహజ్యా ("యెహోవా పట్టుకొనును"), యెహోరాము ("యెహోవా ఔన్నత్యంగలవాడు"), మరియు అతల్యా ("యెహోవాయే బలవంతుడు"), మనం కొంచెం లోతుగా గమనించినట్లయితే అతడు దేవునికి విధేయుడై దీనునిగా నిల్చినవాడని.

ఈ వివాహ ఏర్పాటులు జరిగినప్పుడు, గొప్ప రాజకీయ దుమారం రేగుతుందని. తూరు గొప్ప భోగభాగ్యాలతో విలసిల్లుచున్నది. ఫెనీకేయులతో ఇశ్రాయేలు యొక్క రాజకుమారుడు, తూరు దేశము యొక్క అందాల తెలివి తేటలు నవనాగరికతగల రాజకుమారిని పెండ్లి చేసుకోవడం అదీ బోలెడంత కట్నం కాసులతో అనేది ఒక తెలివైన నిర్ణయం అని గ్రహించవచ్చు. ఏదైతేనేం, ఈ వివాహం అహాబును నాశనం చేయుటయే గాక ఒక రాజ్యాన్నే సర్వ నాశనం చేసింది.

మనం ఎవరిని వివాహం చేసుకుంటే ఏమవుతుంది? అలా అనుకోవద్దండోయ్. మనం ఎవరిని వివాహమాడాలో నంటూ మనం తీసుకునే నిర్ణయం ఈ లోకంలో మన సంతోష సమాధానాలకు మరియు మనకున్న పరలోక నిరీక్షణకు మనకెలా దోహదం చేస్తుందా అనేదే మనం గుర్తుంచుకోవలసి ఉంది.

ఇప్పుడు ఇంకా ముందుకు 33వ వచనంలోకి వెళ్ళితే మనకేం ఆశ్చర్యం కలుగకపోవచ్చు: "అహాబు తన క్రియల ద్వారా ఇశ్రాయేలీయుల ప్రభువగు దేవుని కోపాగ్ని రేపినాడు ఎందుచేతనంటే తన కంటె ముందుగా ఇశ్రాయేలు రాజులందరికంటె

ఎక్కువ చెడుతనం చేయడంవల్ల."

ఈ చివరిలో ఈ వచనం ఒక నిట్టూర్పుతో, గాయమైన గుండెకు కలిగిన భారంతో ముగుస్తుంది. నిజమైన ఏకైక దేవుని పట్ల ఉన్న విశ్వాసపు చిరు దివ్వె కూడ ఆరిపోయినంతపనయింది. ఒక బోధకుడు ఈ పరిస్థితినంతా నవీకరిస్తూ క్లుప్తంగా యిలా అంటున్నాడు: "ఒక గోదురు కప్ప సింహాసనముపై తిష్ఠవేసుకొని కూర్చుని ఉంది, దాని ప్రక్కనే విషసర్పం చుట్టుకొని కాచి ఉంది." ఆ చుట్టు ప్రక్కగా పూలు ప్రదేశాలంతా బయలు సేవా మిషనెరిలాగ కిటకిటలాడుతుంది. ఇక ఇశ్రాయేలు ప్రజల సంగతేమిటి? వారు రెండు ఉద్దేశాల మధ్య యిరుకునపడియున్నారు. రాజకీయ యుక్తి ఏమని చెబుతుందంటే "అనవసరమైన రచ్చ బండకెక్కవద్దు; ఈ సందర్భంలో మౌనం వహించడమే తెలివైన పని." కొన్నిసార్లు రాజీపడడం అనేది ఓర్చుకొనుట అనే బహుమతివలె చక్కగా తళుకు కాగితంలో చుట్టి మనకందించబడుతుంది.

ఏడు వేలమంది ఈ బయలుకు మోకరిల్ల లేదు, లేదా ఆ విగ్రహాన్ని ముద్దుపెట్టు కోనూ లేదు. కాని వారి పెదాలనుండి ఒక్క మాటకూడ మెదలలేదు. ఒక వందమంది యెహోవా ప్రవక్తలు, అప్పటికి బ్రతికివున్నారు, కాని ఎక్కడో ఒక గుహలో దాగియున్నారు, భయభ్రాంతులై వణకుచువున్నారు.

యెహోవా పక్షంగా ఎవరు నిలబడతారు?

ఇశ్రాయేలులో దైవ జనుడెక్కడవున్నాడు?

వారిలో ఎవరైనా ఈ భయంకరులైన అహాబు, యెజెబెలులు, మరి యాజకుల సైన్య సమూహాన్ని ఎదురాడి నిలువగల వారెవరైనాయున్నారా?

ఈ ప్రశ్నల ప్రభావాన్ని ఈ రోజు మనము పొందుచున్నామా? మన చుట్టూ అవినీతి అబద్ధ మతఛాయలు అలముకొని ఉన్నాయి. క్రైస్తవులు అనబడినవారు మందిలో కలసిపోయి, ఈ పరిసర ప్రాంతంలో వాళ్ళల్లో అసలు వారెక్కడ కలిసివున్నారోనంటూ వేరు చేయడానికి కూడ వీలులేకుండావుంది పరిస్థితి. మధ్యరకపు మత ఛాయలు అలుము కుంటున్నాయి. మనం ఎప్పుడూ ఏదో తొందర్లో బిజీగా ఉన్నామంటే ఒట్టే.

ప్రభువు కోసం ఎవరు నిలబడతారు? ఎవరు?

తర్వాత 16వ అధ్యాయం దేనికిని అనుబంధంకాని దీనికి అతకని సంఘటన సందర్భంతో ముగుస్తుంది:

> అతని దినములలో బేతేలీయుడైన హీయేలు యెరికో పట్టణమును కట్టించెను. అతడు దాని పునాదివేయగా అబీరాము అను అతని జ్యేష్ఠపుత్రుడు చనిపోయెను; దాని గవునులనెత్తగా సెగూబు అను అతని కనిష్ఠపుత్రుడు చనిపోయెను. ఇది నూను కుమారుడైన యెహోషువ ద్వారా యెహోవా సెలవిచ్చిన మాటచొప్పున సంభవించెను (34 వచనం).

మనం మరలా చూచినట్లయితే, "ప్రభువు యొక్క వాక్య ప్రకారం," ప్రేరేపణాత్మకమైన హెచ్చరిక స్వరం నిజంగా వచ్చింది.[1] దేవుడు నిత్యం నిలిచివుండి తన కార్యములు నెరవేర్చుచున్నాడని మనం తెలుసుకొనేలా చేస్తున్నాడు గ్రంథ కర్త.

ఇప్పుడు మనం 17వ అధ్యాయంలోని మొదటి వచనానికి వస్తున్నాము:

> అంతట గిలాదు కాపురస్థుల సంబంధియును తిష్బీయుడునైన ఏలీయా అహాబునొద్దకు వచ్చి – ఎవని సన్నిధిని నేను నిలువబడియున్నానో, ఇశ్రాయేలు దేవుడైన ఆ యెహోవా జీవముతోడు నా మాటప్రకారము గాక, యీ సంవత్సరములలో మంచైనను వర్షమైనను పడదని ప్రకటించెను.

దీనికంతటికి మూలపదం "అంతట ఏలీయా ... ఇలా అనెను" అని గ్రహించగలం.

## ఇశ్రాయేలులో దేవుని మనిషి

ఇశ్రాయేలులో దేవునికొక మనిషియున్నాడు, అతని పేరు ఏలీయా.

ఈ ఏలీయా ఎవరు? వాస్తవానికి యితనెవరో ఈ క్షణం వరకు మనకు తెలియదు. కాని అనుకోకుండ హఠాత్తుగా రంగంలోకి అడుగిడుతున్నాడు. ఆ రాజ్యపు రాజును, రాణిని, ఆ దేశపు మతాన్ని బయలు ప్రవక్తలను చివరకు ఆ దేశం, దేశాన్నే సవాలు చేస్తున్న విధానాన్ని చదువుతున్నాం!

ఏలీయా గురించి మనకు కొద్దిగా మాత్రమే తెలుసు. అతని కుటుంబం గురించిగాని, చిన్నతనం గురించి గాని తెలియదు. మరి దేవుని నుండి అతనికి వచ్చిన పిలుపు గురించి గాని తెలియదు. కాని మనకు తెలిసింది కొంతయే అయినా అదెంతో గొప్ప ఆశీర్వాదకరమైందే.

ఏలీయా "తిష్బీయుడు, ... గిలాదు ప్రాంతంలో స్థిరపడినవారు." "తిష్బీయుడు" అనగా, అతడు గిలాదు ప్రాంతంలో ఎక్కడో మూలనున్న ఒక చిన్న అనామక అనాగరిక గ్రామంనుండి వచ్చినవాడని అర్థం. గిలాదు, యొర్దానుకు తూర్పు ప్రాంతం. ఇది చాలా మోటు ప్రదేశం, అడవి ప్రాంతం. (చూడు మ్యాప్ పేజీ 46.) ఇది సామాన్య ప్రపంచానికి దూరంగా ఉన్న నిర్జనమైన ఒంటరి భూభాగం. ఆ భూభాగంలో చుట్టూ కోట గోడలు కట్టబడిన పట్టణాలు లేనే లేవు; ప్రజలంతా చిన్న చిన్న గుడారాల్లో బ్రతికేవారు. పశువులను కాసుకొంటు, అడవి జాతి పశుగణాన్ని ఆధారం చేసి పొట్ట పోసుకుంటున్న బీద ప్రజలు. ఆ అనాగరిక ప్రాంతంలో ప్రజలు నాగరికతకు దూరంగా అప్పుడు అంధకారంలో బ్రతుకుతున్నారు.

ఇక్కడ అహాబు, యెజెబెలులను యిట్టే ఆకర్షించి వారి మనసులను ఆకట్టుకునే మాటలకారిని గాని లేదా అందాల నీలివర్ణ దుస్తులతో ధగధగామెరిసే రాకుమారుణ్ణిగాని దేవుడెన్నుకోలేదు. కాని ఎడారి అనబడిన విశ్వ విద్యాలయంలో విద్యాభ్యాసం చేసి "ఏకాంతవాసి ఎడారివాసి" అన్న పట్టభద్రుని దేవుడు ఎన్నిక చేసుకున్నారు.

ఏలీయాను యిలా అభివర్ణించారు, "అతడు గొంగళి ధరించుకొని నడుమునకు తోలుదట్టి కట్టుకొనినవాడని" (2 రాజులు 1:8). రోమములతో చేయబడిన మోటుతనానికి సూచనయైన గొంగళి (జెకర్యా 13:4). బాప్తిస్మమిచ్చు యోహాను ఏలీయా స్వభావంలో వచ్చినప్పుడు ఒంటె రోమములతో వస్త్రమును, మొలచుట్టును తోలుదట్టియు ధరించుకొనినవాడై పట్టణానికి వెలుపల జీవిస్తూ మిడతలను, అడవి తేనె తింటూ బ్రతికేవాడు (మత్తయి 3:4).

ఏలీయాను గురించిన మన అభిప్రాయం ఏంటి అనుకుంటే, మోటు దుస్తులు ధరించిన ఒక అడవి మనిషి అని ఒంటినిండా రోమాలతో అడ్డగోలుగా ఎదిగే గడ్డం; ఎఱ్ఱని మొద్దుబారి దళసరిగా కనిపించే ఎఱ్ఱనిరంగు శరీరంతో గిలాదులోని అస్తవ్యస్త, ఖఠోరమైన

జీవితంతో కరుకైన కండలు పెరిగి ఒక దిట్టమైన క్రీడాకారునిలా కనుపించేవాడని, ఇక తేజాశ్వములకు మించి ఉన్నతమైన వేగంతో పరుగెత్తగల సమర్థుడని మనం గ్రహించగలం. జీవముగల దేవుని సేవపట్ల ఆసక్తితో అతని మనోనేత్రాలు ధగధగ వెలిగిపోతున్నాయి; ఇక అతని ఉత్తరీయం – ఆ ముతక అంగీ, అది ఒంటె రోమాలతో చేయబడిందో, జంతు చర్మంతో చేయబడిందో గాని అది అతని భుజాలనుండి క్రిందిదాకా వేల్రాడుతూ అది తన ఉద్యోగవృత్తికి చిహ్నంగాను, అనేక అద్భుతాలకు సూచక క్రియలకు మూలాధారం అన్నంతగా అనిపిస్తుంది.

దేవుని మార్గాలు మన మార్గాలాంటివి కావు. మనిషి చూచినట్లుగా దేవుడు చూడడు. మనం తరుచుగా అంటుంటాం, "ఆ నేను అంత విద్యావంతున్ని కాదు; దేవుని సేవలో ఇది అదీ ఏదో చేయడానికి నేను సిద్ధంగా లేను. నాకు చదువు లేదు, సమర్థత అసలే లేదు" అని అంటుంటాం. కాని ప్రభువుకు కావలసిందల్లా ఏలీయాలాంటి హృదయాసక్తి గలవారే – ఆయన మీద వారి హృదయాన్ని నిలిపి, ఆయన సేవకోసం ఆసక్తితో మండిపోయే హృదయంగలవారే.

అడవి మనిషిలా అనిపించే వ్యక్తి ఒక రాజుగారి ముందు నిలిచి ఈ సవాలు చేయడం చూద్దాం: "ఎవని సన్నిధిని నేను నిలువబడియున్నానో, ఇశ్రాయేలు దేవుడైన ఆ యెహోవా జీవముతోడు నా మాటప్రకారము గాక, యీ సంవత్సరములలో మంచైనను వర్షమైనను పడదని ప్రకటించెను" (1 రాజులు 17:1బి).

ఏలీయా విసిరిన సవాలు గురించి మూడు ప్రాముఖ్యమైన విషయాలు గమనిద్దాం:

(1) ఇది రాజుపై ముఖాముఖిగా విసిరిన సవాలు. ప్రవాది మాటలోనే దేవుడు లేని ఆ మతాన్నే పూర్తిగా తుడిచి పెట్టాలన్నంత ముక్కుసూటిగా సవాలు విసిరినాడు.

(2) ఇది బయలు పై విసిరిన సవాలు. బయలు వారి ప్రకృతి దేవత. మంచును వర్షాన్ని బయలు చేతిలో ఉందని ప్రజలు భావించేవారు. కాని ఏలీయా ఒక ఎదురు దెబ్బ కొట్టాడు, "వర్షం ద్వారా జవాబిచ్చు దేవుడే నిజ దేవునిగా ఉండుగాక!" అని అన్నాడు.

(3) ఒక్కడుగా నిలిచి ఏక కంఠంతో విసిరిన సవాలు అది. మనం యింకా ముందుకు చదువుతుంటే ఏలీయా తనకు తన స్నేహితులుగాని, సహచరులుగాని, కలసి తనతో శ్రమించే వాళ్ళుగాని, తనకు చేయూతనిచ్చే గుంపుగాని లేకుండ తన ప్రాణం ఒడ్డెయిన ఎదురు దెబ్బలకు సైతం ఎదురు నిల్చిన ఏకైక యోధుడు.

మనలో చాలామందిమి ఈ విషయంలో ఏలీయాతో ఏకీభవించగలం. ఎలాగంటే మనం పని, ఉద్యోగం చేస్తున్న దగ్గర, మనం పనిచేసే బళ్ళో, మన ఇరుగు పొరుగుల మధ్య, మన గృహాల్లో సైతం, ఇంకా మనం హాజరవుతున్న సంఘంలో సైతం మనం ఒంటరిగా ఎదుర్కొనాలి. ఇదెంతో కష్టమైన విషయం, కాదంటారా?

ఇలాంటి ఎదురు దెబ్బలను ఎదుర్కోడానికి అతనికి సమర్థతను యిచ్చినదేది? దీనికి జవాబేమనగా అతడు ఒంటరివాడు కాదు. వాక్య భాగమేమని చెబుతుందంటే, "అతడు ఏలీయా. అహాబుతో యిలా చెప్పెను, 'ఇశ్రాయేలు ప్రభువును జీవముగల దేవుడును, నేనెవరిముందు నిల్చున్నానో ఆ దేవుడు' " అంటూ బిగ్గరగా చెప్తున్నాడు ఏలీయా. ఏలీయా తనపై తనకు *ఆత్మ విశ్వాసం* లేక పోయియుండవచ్చుగాని అతడు *యెహోవా* పట్ల పూర్తి విశ్వాసం గలవాడు. ఏలీయా తన సామర్థ్యం మీద తాను ఆధారపడలేదు గాని సర్వసృష్టికి

కర్తపై ఆధారపడియున్నాడు.

ఇంతకు ముందు ఇతని గురించి కొద్దిగా మాత్రమే తెలుసుకున్నాము అని చెప్పుకున్నాము. ఇప్పుడు యింకా కొంచెం వివరాల్లోకి తొంగి చూద్దాం: దేవుని ప్రేమించి అతన్ని దేవుని మార్గంలో పెంచిన తలిదండ్రులు అతనికున్నారు. అలా నేనెందుకు చెబుతున్నాను? ఎందుకంటే వారతనికి పెట్టిన పేరును బట్టి "ఏలీయా" అనేది ఒక మిశ్రపదము. "ఏల్" అనేది "దేవుడు" అనే మాటకు హెబ్రీ పదం. "యా" (లేక "యాః") అనేది "యెహోవా" అనే మాటకు సంక్షిప్త పదం. ఇక్కడ "ఐ" అనేది హెబ్రీ భాషలో సంబంధార్థిక సర్వనామం "నేను" "నా." కాబట్టి అతని పేరు శబ్దార్థ ప్రకారం "యెహోవా నా దేవుడు." ఇంకోరకంగా చెప్పాలంటే, బయలు నా దేవుడు కాదు, లేదా అహాబు కూడ కాదు, కాని యెహోవాయే.

దేవునిమీద ఎంత ఆధారపడియుండవలెనో అనేది అతని పేరే చెబుతుంది. ఆ సందర్భంలో అతడేమి చెప్పాడంటే, అతని నమ్మకమంతా ప్రభువుమీదేనని: "నేనెవరి ముందు నిలిచియున్నానో, ఆ ప్రభువును, జీవించుచున్న ఇశ్రాయేలు దేవుడైన వానిని" అంటున్నాడు. ఈ మాటల్లో ఎంతో గూఢార్థం దాగియున్నది.

మీ అన్య దేవతలు మరణించారు మరలా తిరిగి రారు, నా యెహోవా అలా మరణించలేదు జీవించేయున్నాడు అంటూ ఎంతో రోషంతో చెబుతున్నాడు ఏలీయా.

"జీవముగల దేవుని సముఖమందు నిలిచియున్నాను అంటున్నాడు. ఏలీయా అను నేను నీ సముఖంలో ఉన్ననూ, అహాబు, నేనెవని సముఖంలోయున్నానో నాకు భాగ తెలుసు."

ఏలీయా యింకా యిలా అంటున్నాడు, "ఆయన నాకాజ్ఞాపించినది చేయడానికి ఆయన సేవకునిగా నీ ముందు నిలబడియున్నాను, అంతేగాని నీవు చెప్పింది చేయడానికి కాదు! ఆయన ప్రతినిధిగా దేవుని మాట వినడానికి మాత్రమే నీ యెదుట ఉన్నానంటూ" కుండబద్దలు కొట్టి చెబుతున్నాడు ఏలీయా.

"నేను దేవునికి భయపడుతున్నాను; కాని నీకు భయపడడం లేదు" అని ఏలీయా అంటున్నాడు.

అవును, ఇశ్రాయేలులో దేవునికి తన మనిషి ఉన్నాడు.

## ముగింపు

ఈ పాఠ్యాన్ని మన వ్యక్తిగత జీవితానికి ఆపాదించుకొందాం.

కొన్ని కొన్ని ప్రత్యేక సమయాల్లో దేవుని కోసం కొందరు స్త్రీలు, పురుషులు, బాలకులు కావాలి. ఒక్కొక్క సమయంలో వారు ఒంటరిగా నిలబడవలసివచ్చినప్పటి కష్టదినాల్లో సైతం తనకోసం నిలబడగల సమర్థులైన వారికోసం ఆయన యింకా చూస్తూనేవున్నాడు. తండ్రులు, పిల్లలు, భర్తలు, భార్యలు, కుమారులు, కుమార్తెలు, ఉద్యోగస్తులు, యజమానులు, రిటైరయినవారు, విద్యార్థులు, చిన్న బాలబాలికలు, పెద్దలు, యువతీయువకులు, వృద్ధులు మధ్యవయస్కులు: దేవుడు తనకోసం నీవు కూడ ప్రత్యేకించబడినవాడుగా ఉండాలని కోరుకుంటున్నాడు. ఏలీయా జీవితం చూచినట్లయితే దేవుని కోసం సమర్పించుకున్న జీవితం ఏమి సాధించిందో గమనించవచ్చు.

ఏలీయా జీవితం లాంటి జీవితం, అనగా వారు పూర్తిగా సమర్పించుకొన్న జీవితం. ఏలాంటి క్లిష్టపరిస్థితినైనా, ఏలాంటి కష్టతరమైన పనినైనా చేయడానికి సిద్ధమైన జీవితాన్ని వాడుకోగలడని చూపిస్తుంది. నీవు యిలాంటి ఒకనిగా యుండడానికి యిష్టపడుతున్నావా?

---

సూచన

[1]యెహోషువ 6:26లో ఈ శాపమును గూర్చి వ్రాయబడింది.

## దృశ్య సాధనాల-నోట్స్

ఈ పాఠ్య ప్రణాళిక సరళిలో చాలా సులభ గ్రాహ్యమైన చిత్ర పటాలు వాడడానికి సలహా యివ్వబడుతుంది. 46వ పేజిలోని ఏలీయా దినములలో పటము ఒక పరిచయ పటముగా మొదటి పాఠ్యం ప్రారంభంనుండే వాడుతూ ఆయా పట్టణాలకు కొన్ని కొండగుర్తులను గుర్తిస్తూ చివరి పాఠ్యందాకా కొనసాగవచ్చు.

## పాఠం యొక్క సంక్షిప్త వర్ణన

**పరిచయం**

A. పాత నిబంధన పురుషుల్లోని ఒక అసాధారణ వ్యక్తిని గూర్చిన అభ్యసించడానికి ప్రారంభించుచున్నాం.
   1. క్రొత్త నిబంధనలో ఇతని గూర్చి ముప్పైసార్లకు పైగా ప్రస్తావించబడింది.
   2. యేసు రూపాంతరము చెందినప్పుడు ఆయనతో కనబడినవారిలో ఒకడు ఏలీయా.

B. అతనేదో గొప్ప వ్యక్తి అని, పరిశుద్ధుడని, లేదా మానవాతీతుడని భావించ కూడదు. అయితే, అతడు ఒక ప్రత్యేక సమయంలో దేవుడు వాడుకున్న ఒక ప్రత్యేకమైన వ్యక్తి.

**I. ఏలీయా దినాల్లో ఇశ్రాయేలీయులు**

A. ఏలీయాను ఎంత అభినందించాలంటే, మనం అతని సమకాలీన సమయాల్లోకెళ్ళి అతన్ని చూడాలి.
   1. 1 రాజులు 16:29తో ప్రారంభించుకొందాం:
      a. ఇశ్రాయేలు రెండు రాజ్యాలుగా విభజింపబడింది. ఉత్తర రాజ్య విభాగంలో ఏలీయా పనిచేశాడు.
      b. అహాబు ఇరువది రెండు సంవత్సరాలు ఇశ్రాయేలీయులను పరిపాలించాడు.

2. అహాబు అతని జీవితంలో అనేకం సాధించాడు. కాని ఈ ప్రేరేపించబడిన రచయిత వాటిలో కొన్నిటినే చెప్తుతున్నాడు. 1 రాజులు 16:30లో అహాబును గూర్చిన దేవుని దృక్పథాన్ని గూర్చి వివరిస్తుంది: "అతనికంటె ముందున్న వారందరి కంటె ఎక్కువ చెడుతనం జరిగించాడు."
   a. యరొబాము కంటె యింకా ఎక్కువ దుష్టత్వంలో (1 రాజులు 12:28, 29, 31, 33)
   b. నాదాబుకంటె ఎక్కువగా (1 రాజులు 15:26, 27)
   c. బయెషాకంటె ఎక్కువగా (1 రాజులు 15:29, 33, 34)
   d. ఏలా కంటె ఎక్కువగా (1 రాజులు 16:8-10)
   e. జిమ్రీ కంటె ఎక్కువగా (1 రాజులు 16:11, 15)
   f. ఒమ్రీకంటె ఎక్కువగా (1 రాజులు 16:23-26)
3. అహాబు యెజెబెలును వివాహం చేసుకొన్నాడు (1 రాజులు 16:31). ఇశ్రాయేలు రాజుయొక్క వివాహం గురించి ప్రస్తావించడం యిది మొదటిసారి. మరి యిది ఎందుకు ప్రస్తావించబడింది?
   a. యెజెబెలు ఎవరు అనే దానివల్ల (గమనించు ప్రకటన 2:20). "ఆమె సీదోనియ రాజైన ఎత్బాలు కుమార్తె." ఆమె అన్యురాలు (ద్వితీయోపదేశకాండము 7:1-5). ఆమె తండ్రి బయలుకు యాజకుడు.
   b. యెజెబెలు చేసిన దానిని బట్టి. ఆమె గొప్ప మిషనెరీ ఆసక్తి చూపించి ఇశ్రాయేలు సమాజంలో బయలు ఆరాధనను పరిచయం చేసింది.
   c. యెజెబెలు తన భర్తమీద ప్రభావం చూపించింది కాబట్టి: 1 రాజులు 16:31-33. ఆమె బలవంతురాలుగా ఉంది. ఆమె భర్త అహాబు బలహీనుడుగా ఉన్నాడు. (నీవు ఎవరిని వివాహం చేసుకుంటావో అప్పుడు దానిని బట్టి వ్యత్యాసం తెలుస్తుంది!)
4. "అహాబు తన పూర్వికులైన ఇశ్రాయేలు రాజులందరికంటె ఎక్కువగా పాపము చేసి ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవాకు కోపము పుట్టించెను" (1 రాజులు 16:33).

B. ఈ పరిస్థితులు ఉన్న ఈ కాలమును మనం చూస్తుంటే, యెహోవా పక్షంగా ఎవరైనా అసలు నిలువగలరా అన్న ఆశ్చర్యం మనకు కలుగుతుంది. ఇశ్రాయేలులో తనకోసం నిలువబడగల వ్యక్తిని దేవుడు కలిగియున్నాడా?
1. రాజులు 16 అధ్యాయం చివరిగా కొంత వింతైన వచనంతో ముగుస్తుంది: వచనం 34. దేవుడు జీవించేవున్నాడు, చురుగ్గా పనిచేస్తునేయున్నాడు!
2. 1 రాజులు 17:1 వివరణ గమనించండి. దేవుడు ఇశ్రాయేలులో తనకోసం, ఒక మనిషిని కలిగియున్నాడు. ఆయన పేరు ఏలీయా.

## II. ఇశ్రాయేలులో దేవుని మనిషి

A. ఏలీయా ఎవరు?

1. అతను "గిలాదులో స్థిరపడిన తిష్బీయుడు."
   a. "తిష్బీ" అనే చిన్న గాతులోనుండి వచ్చినవాడే ఈ "తిష్బీయుడు."
   b. "గిలాదు" ఎంతో అడవి మోటు దేశం, యొర్దాను నదికి తూర్పుగా ఉన్నది.
2. ఏలీయా "అతడు గొంగళి ధరించుకొని నడుమునకు తోలుదట్టి ధరించుకొనినవాడు" (2 రాజులు 1:8; చూడు జెకర్యా 13:4; మత్తయి 3:4)

B. ఈ అడవి మనిషిలాంటివాడు రాజుగారి ముందే నిలబడి సవాలుచేయడం చూస్తున్నాం: 1 రాజులు 17:1.

1. ఈ సవాలు గురించి మూడు విషయాలు చూద్దాం:
   a. అది రాజుకు వేయబడిన సవాలు.
   b. బయలుకు వ్యతిరేకంగా వేయబడిన సవాలు.
   c. ఇది ఒకే ఒక వ్యక్తి యొక్క ఒంటరి సవాలు.
2. ఈలాంటి దుర్భర పరిస్థితులను ఏలీయా ఎలా ఎదుర్కొన్నాడు? ఏలీయా యొక్క నమ్మకమంతా దేవుని మీదే.
   a. అతని పేరును బట్టి చూస్తే దేవునియందు విశ్వాసం కలిగిన తలిదండ్రులను అతడు కలిగియున్నాడని తెలుస్తుంది.
   b. అతడు మాట్లాడే మాటనుబట్టి చూస్తే అతనికి **ప్రభువు**పట్ల సంపూర్ణ నమ్మకం ఉందని తెలుస్తుంది.

C. ఇశ్రాయేలులో దేవుని మనిషి అతను.

## ముగింపు

A. కొన్ని ప్రత్యేక సమయాల్లో దేవునికి కొందరు ప్రత్యేకమైన వ్యక్తులు కావాలి. అది కూడ ఎవరైతే తనకోసం పరిపూర్ణంగా సమర్పించుకొంటారో వారిని మాత్రమే వాడుకుంటాడు సుమా!

B. నీవు కూడ దేవుని మనిషిగా లేక దేవుని మహిళగా ఉండడానికి యిష్టపడుతున్నావా?